క్లుప్తంగా

ముమ్మరంగా పెద్ద కోనేరు అభివృద్ధి పనులు



మంగళగిరి: నగరంలోని లక్ష్మీనృసింహ స్వామి దేవస్థానానికి చెందిన పెద్ద కోనేరు (కల్యాణ పుష్కరిణి) అభివృద్ధి పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. పెద్దకోనేరు అభివృద్ధి పనులను మంగళవారం ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) అధికారులతో కలిసి పరిశీలించి పలు సూచనలు చేశారు. కోనేరు అభివృద్ధి పనుల నాణ్యతలో రాజీపడకుండా త్వరితగతిన పూర్తిచేసి స్వామి వారి తెప్పోత్సవం నాటికి అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ ఎ.రామకోటి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు అటవీశాఖ ప్రధాన కార్యాలయం ప్రారంభం

మంగళగిరి: నగర పరిధిలోని ఆటోనగర్‌లో పీవీఎస్ ల్యాండ్‌మార్క్ భవన్‌లో అటవీశాఖ ప్రధాన కార్యాలయం ప్రారంభం కానుంది. గురువారం రాష్ట్ర అటవీశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కార్యాలయాన్ని ప్రారంభించనున్నట్లు అటవీశాఖ ప్రధాన ముఖ్యసంరక్షణ అధికారి వై.మధుసూదనరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

తాడేపల్లి రూరల్: తాడేపల్లి మండల పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ డీఈ అక్కుల సత్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉండవల్లి గ్రామం, పోలకమ్మ గుడి పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలన్నారు.

ఇన్నోవేటివ్ యూనివర్సిటీ -2022గా 'ఏపీ ఎస్ఆర్ఎం'

మంగళగిరి: ఏపీ ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయానికి ఇన్నోవేటివ్ యూనివర్సిటీ ఆఫ్ ది ఇయర్ - 2022గా గుర్తింపు లభించింది. బెంగళూరు కేంద్రంగా ప్రచురితమవుతున్న అకడమిక్ ఇన్‌సైట్స్ మేగజైన్ యాజమాన్యం దీన్ని ప్రకటించింది.

ఉన్నత విద్యారంగంలో సాధించిన ప్రగతి, నూతన ఆవిష్కరణలకు గుర్తింపుగా ప్రైవేట్ విశ్వవిద్యాలయాల కేటగిరీలో ఏపీ ఎస్ఆర్ఎంను ఎంపిక చేసినట్లు మేగజైన్ తెలిపింది. ఏటా విశ్వవిద్యాలయాల పనితీరును విశ్లేషించి ఉత్తమ యూనివర్సిటీలకు ఈ మేగజైన్ వివిధ కేటగిరీల్లో ప్రత్యేక గుర్తింపునిస్తుందని, ఇందులో భాగంగా 2022 విద్యాసంవత్సరానికి గానూ ఉత్తమ సృజనాత్మక విశ్వవిద్యాలయంగా ఏపీ ఎస్ఆర్ఎం ఎంపికైనట్లు కమ్యూనికేషన్స్ డైరెక్టర్ పంకజ్ బల్వేరియర్ పేర్కొన్నారు.

భారత్ పోస్ట్‌పేపై ఫిర్యాదు

తాడేపల్లిరూరల్ : ఉండవల్లికి చెందిన ఓ యువకుడు భారత్ పోస్ట్‌పేపై తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం రాత్రి ఫిర్యాదు చేశారు. బాధితుడు బొంతు గంగాధర్ యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం.. నెల రోజుల క్రితం భారత్ పోస్ట్‌పేలో వ్యాపార నిమిత్తం 50 వేల రూపాయల నగదును గంగాధర్ అప్పుగా తీసుకున్నారు. అందులో రూ.30 వేలు ఈఎంఐ రూపంలో నెలకు రూ.5 వేలు చెల్లిస్తున్నారు. మిగిలిన రూ.20 వేలకు సంబంధించి ఈ నెల 13వ తేదీ నగదు చెల్లించాల్సి ఉంది. పండుగ రావడంతో చెల్లించలేకపోయాడు. ఈ నేపథ్యంలో 17న సాయంత్రం భారత్ పోస్ట్‌పే నుంచి ఫోన్ చేస్తున్నామని ఓ వ్యక్తి గంగాధర్‌తో మాట్లాడాడు. డబ్బులు చెల్లించడం ఆలస్యం కావడంపై దుర్భాషలాడాడు. డబ్బులు చెల్లిస్తానని చెప్పినా వినకుండా మాటలతో మానసికంగా వేధించాడని బొంతు గంగాధర్ పేర్కొన్నారు. ఈ మేరకు తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ద్విచక్ర వాహనం చోరీకి యత్నం

స్థానికులు గమనించడంతో పరారీ

తాడేపల్లిరూరల్: ద్విచక్ర వాహనం చోరీకి ప్రయత్నించిన సంఘటన ఉండవల్లిలో చోటుచేసుకుంది. ఉండవల్లిలోని కుమ్మరిగుంటకు చెందిన ఓ యువకుడు తన ద్విచక్ర వాహనాన్ని ఇంటి ముందు పార్క్ చేసి హ్యాండిల్ లాక్ వేశాడు. మంగళవారం తెల్లవారుజామున గుర్తుతెలియని ముగ్గురు వ్యక్తులు వేరే ద్విచక్ర వాహనంపై వచ్చి లాక్ చేసి ఉన్న ద్విచక్ర వాహనం హ్యాండిల్ లాక్ తీసి స్టార్ట్ చేసేందుకు ప్రయత్నించగా, ద్విచక్ర వాహనం స్టార్ట్ అవ్వలేదు. దీంతో ఆ వాహనాన్ని నెట్టుకుంటూ పంట పొలాల్లోకి తీసుకువెళ్లగా స్థానికులు గమనించడంతో దొంగలు ద్విచక్ర వాహనాన్ని అక్కడే వదిలి పరారయ్యారు. ఈ సంఘటనపై బాధితుడు వేమ అనిల్‌వెంకట్ తాడేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్రైం బ్రాంచ్ పోలీసులు దొంగలను గుర్తించారు. త్వరలోనే నిందితులను అదుపులోకి తీసుకుని విచారిస్తామని తెలిపారు.

మళ్లీ ముదిరిన ఆలయాల వివాదం



ఇరువర్గాలతో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాసరావు



కొండపైకి వెళ్లే రోడ్డుకు అడ్డంగా వేసిన ఫెన్సింగ్

- విషయం ఆర్డీవో కోర్టులో ఉండగా మేరీ మాత విగ్రహానికి వెళ్లే రహదారికి ఫెన్సింగ్ వేశారంటూ ఎస్సీల ఆగ్రహం
- ఇరువర్గాల పంచాయతీ అనంతరం ఫెన్సింగ్ తొలగిస్తామని అధికారుల హామీ

బడేపురం(తాడికొండ): తాడికొండ శివారు బడేపురంలో ఆలయాల వివాదం మళ్లీ తెరపైకొచ్చింది. గ్రామంలో ఇరువర్గాలకు ఈ వ్యవహారానికి సంబంధించి గతంలో సరిహద్దులు, రహదారి విషయంలో వివాదం నెలకొనడంతో పలుమార్లు ఠాణాలో పంచాయతీ జరిగింది. అయితే సమస్య గ్రామంలో పెద్దదిగా మారే అవకాశం ఉన్న నేపథ్యంలో ఆర్డీవో కోర్టులో పెట్టారు. ఈ నెల 21న ఇరువర్గాలు ఆర్డీవో వద్దకు హాజరుకావాల్సి ఉండగా తాజాగా సోమవారం అర్ధరాత్రి మేరీమాత విగ్రహానికి వెళ్లే దారికి మరో వర్గం ఫెన్సింగ్ వేయడంతో మళ్లీ వివాదం మొదటికి వచ్చింది. కావాలనే తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఎస్సీలు ఆరోపిస్తున్నారు. 100కు డయల్ చేయడంతో పోలీసులు, రెవెన్యూ అధికారులు ఘటనా స్థలానికి వచ్చి పరిశీలించి ఫెన్సింగ్ తొలగించాలని ఆదేశించారు. సిబ్బంది తొలగించేందుకు సిద్ధమవుతుండగా పలువురు అడ్డుకోవడంతో సీఐ ఇరువర్గాలు తహసీల్దార్ కార్యాలయంలో చర్చించుకొని పరిష్కరించుకునేందుకు రావాలని సూచించారు. ఇరువర్గాలతో చర్చించిన డిప్యూటీ తహసీల్దార్ కాకుమాను ప్రసాద్ ఆర్డీవో కోర్టులో నడుస్తుండగా ఫెన్సింగ్ వేయడం మంచిది కాదని, ముందు తొలగించేందుకు సహకరించాలని సూచించారు. ఆర్డీవో విచారణ అనంతరం వచ్చిన ఆదేశాల మేరకు నడుచుకోవాల్సి ఉంటుందని, ఫెన్సింగ్ తొలగించాలని ఆదేశించడంతో వ్యవహారం తాత్కాలికంగా సద్దుమణిగింది. ఇరువర్గాలు వివాదాలకు దిగకుండా ఉండేందుకు పోలీసు పహారా కొనసాగుతుందని సీఐ శ్రీనివాసరావు తెలిపారు.

సచివాలయాల మండల కన్వీనర్‌గా మాగులూరి

పెదకూరపాడు : సచివాలయాల మండల కన్వీనర్‌గా హుస్సేన్ నగర్ గ్రామ సర్పంచ్, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు మాగులూరి అనిల్ కుమార్‌ను ఎమ్మెల్యే నంబూరు శంకరరావు మంగళవారం ప్రకటించారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ బలోపేతానికి, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నంబూరు శంకరరావుకు కృతజ్ఞతలు తెలిపి, శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య, మాజీ ఎంపీపీ ఈదా సాంబిరెడ్డి, జడ్పీటీసీ కంకణాల స్వర్ణకుమారి, వైస్ ఎంపీపీ షేక్ చాంద్‌బాషా, వైఎస్సార్ సీపీ జిల్లా నాయకులు కంకణాల శివాజీ, మండల కన్వీనర్ షేక్ మస్తాన్‌షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే శంకరరావును సత్కరిస్తున్న మాగులూరి అనిల్‌కుమార్

క్రోసూరుకు.. సయ్యద్ అబ్దుల్ రహీం

క్రోసూరు: మండల సచివాలయ కన్వీనర్‌గా తనను నియమించిన ఎమ్మెల్యే నంబూరుశంకరరావుకు సయ్యద్ అబ్దుల్ రహీం మంగళవారం కృతజ్ఞతలు తెలిపారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలన్నీ ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు వలంటీర్లతో కలిసి మరింత కృషి చేస్తానన్నారు. వలంటీర్లకు, ప్రజలకు వారధిగా ఉండి సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా కృషి చేస్తానని తెలిపారు.

కోడి పందేల స్థావరాలపై దాడులు

కొల్లూరు : కోడి పందేలు నిర్వహిస్తున్న స్థావరాలపై పోలీసులు దాడులు చేసి, పందెం నిర్వాహకులను అదుపులోకి తీసుకున్న ఘటన సోమవారం రాత్రి జరిగింది. ఎస్ఐ శామ్యూల్ రాజీవ్ కుమార్ తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని ఈపూరు పరిసర ప్రాంతాల్లో కోడి పందేలు నిర్వహిస్తున్నట్లు సమాచారం రావడంతో.. కొల్లూరు పోలీసులు దాడులు నిర్వహించారు. కోడి పందేలు నిర్వహిస్తున్న మూడు స్థావరాలపై దాడులు జరిపి ఆరు కోడి పుంజులతోపాటు..కోడి కత్తులు, రూ.3,020 నగదు స్వాధీనం చేసుకున్నారు. 12 మంది జూదరులను అదుపులోకి తీసుకొన్నారు. క్రాంతి పండుగ సమయంలో.. ఈపూరు పరిసర ప్రాంతాల్లో కోడి పందేల స్థావరాలపై దాడులు నిర్వహించి, 13 కేసులు నమోదు చేసి 52 మంది జూదరులను అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు.

శరవేగంగా భూ రికార్డుల స్వచ్ఛీకరణ

ఫిరంగిపురం: మండలంలోని పలు గ్రామాల్లో రెవెన్యూ, సచివాలయ సిబ్బందితో భూముల రికార్డుల స్వచ్ఛీకరణ శరవేగంగా నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ పద్మనాభుడు మంగళవారం తెలిపారు. ఎఫ్ఎల్‌పీవోఎల్ఆర్ (ఫీల్డ్‌లెవెల్ ప్యూరిటీ ఆఫ్ ల్యాండ్ రికార్డు)ల్లో భాగంగా భూమికి సంబంధించిన యజమాని వివరాలు, ఆధార్, ఫోన్ నంబర్, సర్వే నంబర్లు ప్రాథమికంగా నమోదు చేస్తున్నామన్నారు. జిల్లా కలెక్టర్ ఏర్పాటు చేసిన సచివాలయంలోని కోర్ కమిటీ సభ్యులైన వీఆర్వో, డీఏ, వెల్ఫేర్ అసిస్టెంట్, అగ్రికల్చరల్ అసిస్టెంట్లు యజమానికి చెందిన భూమి వద్దకు వెళ్లి పూర్తి వివరాలు ప్రాథమికంగా నమోదు చేస్తున్నట్లు తెలిపారు. దీనికి సంబంధించి ముందుగానే సంబంధిత భూ యజమానులకు ముందు రోజు సర్వేపై వివరాలు తెలియజేస్తున్నామని చెప్పారు. సర్వే సమయంలో యజమానులు హాజరై సిబ్బందికి సహకరించాలని కోరారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డ్రోన్ సర్వే నిర్వహించి, పూర్తి స్థాయిలో భూమికి సంబంధించిన చిత్రాలతో భూ సర్వే చేయనున్నట్లు వివరించారు.



భూమి వివరాలు నమోదు చేస్తున్న రెవెన్యూ, సచివాలయ సిబ్బంది

శరద్ యాదవ్, కేపీ రెడ్డయ్యకు ఘన నివాళి

తాడేపల్లిరూరల్: మాజీ కేంద్ర మంత్రి, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి శరద్ యాదవ్, బందరు మాజీ ఎంపీ కేపీ రెడ్డయ్యకు యాదవ సంఘం నాయకులు మంగళవారం ఘన నివాళులర్పించారు. దుగ్గిరాల గ్రామంలోని శివాలయం సెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి తాడిబోయిన రామస్వామి విచ్చేసి వారి చిత్రపటాలకు పూలమాల వేసి అంజలిఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొప్ప లౌకికవాది, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసిన గొప్ప నాయకుడు శరద్ యాదవ్ అని కొనియాడారు. ఆంధ్రప్రదేశ్ యాదవ మహాసభ అధ్యక్షుడిగా విశేష సేవలు అందించిన గొప్ప వ్యక్తి కేపీ రెడ్డయ్య అని పేర్కొన్నారు. కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు నల్లనూకల వెంకటేశ్వరరావు, కుర్రా నాగయ్య, తాడిబోయిన వెంకట నారాయణ, గండు పాములు, నగుళ్ల వెంకటేశ్వరరావు, పసుపులేటి నాగేశ్వరరావు, కె.రామమోహన్‌రావు, చెన్ను కృష్ణప్రసాద్, తాడిబోయిన నరసింహారావు, తాడిబోయిన దేవయ్య, బొడ్డు కోటేశ్వరరావు, గుమ్మా కోటయ్య, నిషాద్ తదితరులు పాల్గొన్నారు.



మాజీ కేంద్ర మంత్రి శరద్‌యాదవ్, మాజీ ఎంపీ కేపీ రెడ్డయ్యకి నివాళులర్పిస్తున్న నాయకులు

రహదారులను కార్పొరేషన్‌కు అప్పగించాలి

కార్పొరేషన్ డీఈ కృష్ణారెడ్డి

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థల పరిధిలోని మంగళగిరి పట్టణం, తాడేపల్లి పట్టణం, విలీన గ్రామాల్లో ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో ఉన్న రహదారులను కార్పొరేషన్‌కు అధికారికంగా అప్పగించాలని డీఈ కృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం ఉండవల్లి అమరావతి రోడ్డులోని పాగాకు వెంకటరత్నం ఇంటి వెనుక కొత్తగా నిర్మించే మూడు రహదారులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంటీఎంసీ పరిధిలోని చాలాచోట్ల 10, 15 సంవత్సరాల క్రితం ఏర్పడిన కొన్ని కాలనీల్లో ఉన్న రహదారులు అప్పటి పంచాయతీకి గాని, ఇప్పటి కార్పొరేషన్‌కు కానీ అధికారికంగా రాసి ఇవ్వలేదని తెలిపారు. నిబంధనల ప్రకారం రోడ్ల కోసం వదిలిన స్థలాన్ని కార్పొరేషన్‌కు రాసి ఇస్తే వెంటనే గ్రావెల్ రోడ్డు నిర్మిస్తామని, ఉండవల్లిలో పలు రహదారులు రాసి ఇవ్వడంతో ఇప్పటికే గ్రావెల్ రోడ్ల నిర్మాణాలు పూర్తిచేశామన్నారు. అమరావతి రోడ్డులో ప్రస్తుతం మూడు రోడ్లు కార్పొరేషన్‌కు అప్పజెప్పడంతో వాటిని గ్రావెల్ రోడ్లుగా మారుస్తున్నామని చెప్పారు. ఒక్కొక్క రహదారిని మూడు నుంచి 5 అడుగుల మేర మట్టి లేపి, రోలింగ్ చేసి తిరిగి మళ్లీ సీసీ రోడ్లు గానీ, బీటీ రోడ్లు కానీ నిర్మిస్తామని తెలిపారు.



ఉండవల్లిలో కొత్తగా నిర్మిస్తున్న గ్రావెల్ రోడ్డు

ఖాతాలో నగదు విత్‌డ్రాపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: తనకు తెలీకుండా తన బ్యాంకు అకౌంట్‌లో డబ్బులు విత్‌డ్రా అయిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శ్రీరామ్‌నగర్‌కు చెందిన దిల్ బహదూర్ సోమవారం చుట్టుగుంట సమీపంలోని చికెన్ షాపునకు వెళ్లాడు. చికెన్ కొనుగోలు చేసే క్రమంలో సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. ఇంటికి వచ్చిన కొంతసేపటి తరువాత అతని కుమారుడు హరిబహదూర్ సెల్‌కు మెసేజ్ వచ్చింది. మెసేజ్ పరిశీలించగా దిల్ బహదూర్ బ్యాంక్ అకౌంట్‌లోని రూ.30వేలు విత్‌డ్రా అయినట్లు మెసేజ్‌లో ఉండటం చూసి ఖంగుతిన్నాడు. బాధితుడు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్రీడలతో స్నేహపూర్వక వాతావరణం

వైఎస్సార్ సీపీ నాయకుడు మోపిదేవి రాజీవ్

నగరం: క్రీడలతో స్నేహపూర్వక వాతావరణం పెంపొందుతుందని వైఎస్సార్ సీపీ నాయకుడు మోపిదేవి రాజీవ్ పేర్కొన్నారు. మండలంలోని ఈదుపల్లి గ్రామంలో క్రికెట్ టోర్నమెంట్ ముగింపు సందర్భంగా మంగళవారం బహుమతి ప్రదానోత్సవ సభలో రాజీవ్ పాల్గొని, మాట్లాడారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని గ్రామాల్లో ఆటల పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు టోర్నమెంట్‌లు దోహదపడతాయన్నారు. ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య మాట్లాడుతూ.. టోర్నమెంట్‌లో 43 జట్లు పాల్గొనగా చెరుకుపల్లి ఈపూరు గణేష్ టీమ్ ప్రథమ, ఈదుపల్లి టీమ్ ద్వితీయ, ఇంటూరు టీమ్ తృతీయ స్థానంలో నిలిచాయని తెలిపారు. వరుసగా రూ.20వేలు, రూ.15వేలు, రూ.10వేలు ప్రోత్సాహక నగదు, షీల్డ్‌లను ఆయా జట్లకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చింతల పవన్‌కుమార్, చందోలు దేవదాసు, వైఎస్సార్ సీపీ నాయకులు పురం వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేకు గ్రామ సభలు ఏర్పాటు చేయాలి

రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జొన్నా శివశంకరరావు

తాడేపల్లిరూరల్: ప్రభుత్వం నిర్వహిస్తున్న భూ రీ సర్వే వల్ల రైతులందరికీ ఉపయోగకరంగా ఉంటుందని, ఈ సర్వే కార్యక్రమాన్ని చేపట్టే ముందు తప్పని సరిగా గ్రామ సభలు నిర్వహించాలని రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడు జొన్నా శివశంకరరావు అన్నారు. ఇప్పటంలో రెవెన్యూ అధికారులు భూ రీసర్వే కార్యక్రమం చేపట్టినట్లు రైతులు చెబుతున్నారని, ఎక్కడ రీ సర్వే చేసినా ఆ గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి రైతుల సమక్షంలోనే రీ సర్వే చేస్తే బాగుంటుందని అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఇదిలాఉండగా తాడేపల్లి తహసీల్దార్ శ్రీనివాసురెడ్డి రీసర్వే కార్యక్రమాన్ని చేపట్టలేదని, రీసర్వే చేయడానికి అవసరమైన పరిస్థితులను అవగాహన చేసుకునేందుకు గ్రామ సచివాలయాల్లో ఉన్న సర్వేయర్లు గ్రామ కంఠాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు.

చందోలులో ఘనంగా హరిద్రశృంగార్చన



పిట్టలవానిపాలెం: మండలంలోని చందోలు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ బగళాముఖి అమ్మవారి దేవాలయంలో 40వ మంగళ వారం హరిద్ర శృంగార్చన కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి జి.నరసింహమూర్తి మాట్లాడుతూ చందోలు గ్రామంలోని బగళాముఖి అమ్మవారి దేవాలయంలో ప్రతి మంగళవారం వివాహం కాని ఆడపిల్లలకు శీఘ్రంగా వివాహం జరిగేందుకు ప్రత్యేకంగా హరిద్ర శృంగార్చన కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. పూజా కార్యక్రమం అనంతరం మహా గౌరీ హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, ఆలయ వంశ పారంపర్య అర్చకులు కుంచల బళ్ళారెడ్డి, నరసారెడ్డి, పరిసర గ్రామాల నుంచి భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని, భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

ఈ-క్రాప్‌లో పంట నమోదు తప్పనిసరి

వేమూరు: రబీలో సాగు చేసే పంటలను రైతులు ఈ-క్రాప్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి చందోలు సునీత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని జొన్న, మొక్కజొన్న, మినుము, పెసర పంటల సాగు చేస్తున్న రైతులు పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్ పుస్తకం జిరాక్స్ గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో అందజేయాలని పేర్కొన్నారు.

టీఎంఎం మారథాన్‌లో నిహాల్‌కు ద్వితీయ స్థానం

గుంటూరు వెస్ట్ (క్రీడలు): ఈ నెల 15న ముంబయిలో జరిగిన టాటా ముంబయి మారథాన్ (టీఎంఎం) చాంపియన్‌షిప్‌లో ఓవరాల్ విభాగంలో గుంటూరుకు చెందిన నిహాల్ అహ్మద్ బేగ్‌కు ద్వితీయ స్థానం దక్కిందని అతని తల్లిదండ్రులు పర్వీన్ బేగ్, అహ్మద్ బేగ్‌లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 42.82 కిలోమీటర్ల దూరాన్ని నిహాల్ 2 గంటల 28 నిమిషాల, 17 సెకెండ్లలో పూర్తి చేసాడన్నారు. రన్నర్‌కు రూ.50 వేలు నగదు బహుమతి అందించారని చెప్పారు. తొలిస్థానం కర్నాటకు చెందిన నంజుడప్పకు దక్కిందన్నారు.



ద్వితీయ స్థానం పొందిన నిహాల్ అహ్మద్ బేగ్ (పొడవుగా ఉన్న వ్యక్తి)

ఉప్పలపాడు ఏటీఎంలో చోరీకి విఫలయత్నం

పెదకాకాని: ఏటీఎంలో చోరీకి ముగ్గురు విఫలయత్నం చేసిన ఘటన సోమవారం అర్ధరాత్రి ఉప్పలపాడులో జరిగింది. ఉప్పలపాడు గ్రామానికి చెందిన గోపి, మరో ఇద్దరు మద్యం మత్తులో ఏటీఎం సెంటర్ వద్దకు చోరీకి వెళ్ళారు. అక్కడ సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహిస్తున్న వ్యక్తి అడ్డుకోవడంతో గొడవ పెట్టుకుని అతడిపై దాడి చేశారు. ఏటీఎం సెంటర్ ప్రధాన డోర్‌ను రాళ్ళతో ధ్వంసం చేశారు. సెక్యూరిటీ గార్డు ఇచ్చిన సమాచారంతో అక్కడికి చేరుకున్న పోలీసులు మద్యం మత్తులో ఉన్న నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. దీనిపై బ్యాంక్ మేనేజర్‌ను ఫోన్ ద్వారా వివరణ కోరగా తాను సెలవులో ఉన్నానని, తనకేమీ తెలియదని సమాధానం ఇచ్చారు.



ఏటీఎం ప్రధాన ద్వారం అద్దం పగిలిన దృశ్యం

రోహిత్ వేముల కుటుంబానికి న్యాయం చేయని కేంద్రం

గుంటూరు ఎడ్యుకేషన్: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో వేధింపుల కారణంగా ఆత్మహత్యకు పాల్పడిన పరిశోధక విద్యార్థి రోహిత్ వేముల కుటుంబానికి న్యాయం చేయడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బందెల నాసర్ జీ ఆరోపించారు. కొత్తపేటలోని మల్లయ్య లింగం భవన్‌లో మంగళవారం రోహిత్ వేముల వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎన్నో ఆశలతో యూనివర్సిటీలోకి అడుగుపెట్టిన రోహిత్ అక్కడ వేధింపులకు వ్యతిరేకంగా పోరాడిన ఫలితంగా హాస్టల్ నుంచి సస్పెండ్ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అవమానాలకు గురైనప్పటికీ ఆత్మస్థైర్యం కోల్పోకుండా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్ఫూర్తితో దీక్షకు దిగి, చివరికి ఆత్మహత్యకు పాల్పడ్డారని తెలిపారు. రోహిత్ ఆత్మహత్య తరువాత అనేక మంది ఎంపీలు పార్లమెంటులో గళం ఎత్తి, ఇప్పటికి ఏడేళ్లు గడిచినా వారి కుటుంబానికి న్యాయం చేయడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి విద్యాలయాలు, విశ్వవిద్యాలయాల్లో విద్యార్థుల మధ్య మత ఘర్షణలు పెంచే విధంగా పని చేస్తోందన్నారు. ఏఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి యశ్వంత్, సాయి, అమరనాథ్, లీలా, వెంకట్ సాయి, అజయ్ తదితరులు పాల్గొన్నారు.



రోహిత్ వేములకు నివాళులర్పిస్తూ నినాదాలు చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు, విద్యార్థులు

పీకలవాగులో వ్యర్థాలను తొలగించండి

పట్నంబజారు: నివాసగృహాల మధ్యన పెద్దఎత్తున మురుగునీరు పారుదలవుతున్న పీకల వాగులో వ్యర్థాలు తొలగించాలని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా అధికారులను ఆదేశించారు. మంగళవారం ఏటుకూరురోడ్డులోని డీఎస్ నగర్, ఆర్.అగ్రహారం, నిమ్మలపేట, చెంచు కాలనీల్లో పర్యటించి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయా ప్రాంతాల్లో నివాస గృహాల మధ్య పీకలవాగు ఉన్న క్రమంలో వ్యర్థాలు పేరుకుపోయి, మురుగునీరు పారుదల అవక ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఎమ్మెల్యే ముస్తఫా దృష్టికి తీసుకొచ్చారు. అదేవిధంగా నివాసాల మధ్య ఖాళీస్థలాలు ఉండటంతో పిచ్చిమొక్కలు, వ్యర్థాలు నిల్వ చేరుతున్నాయని తెలిపారు. దీనిపై స్పందించిన ఆయన ఖాళీస్థలాలు శుభ్రపరిచి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని శానిటరీ అధికారులకు సూచించారు. నిమ్మలపేట, చెంచుకాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించటానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్పొరేటర్ వేముల జ్యోతిపద్మజ, శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, అచ్చిరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.



అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్న ఎమ్మెల్యే ముస్తఫా

మైనార్టీల సమస్యలపై 21న సదస్సు

రేపల్లె: జై భీమ్ భారత్ పార్టీ ఇండియన్ యూనియన్, ముస్లిం లీగ్ పార్టీల ఆధ్వర్యంలో ఈ నెల 21న ఉదయం 10 గంటలకు విజయవాడలోని శ్రీరామ ఫంక్షన్ హాలులో ముస్లిం, మైనార్టీల సమస్యలపై రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహించనున్నట్లు జై భీమ్ పార్టీ నియోజకవర్గ అభ్యర్థి దోవా రమేష్ రాంజీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ సమస్యల పరిష్కారానికై నిర్వహించే సదస్సులో ముస్లిం మైనార్టీలు అధిక సంఖ్యలో పాల్గొని, జయప్రదం చేయాలని కోరారు.